క్లుప్తంగా

నెలిపర్తిలో చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న వైద్యాధికారి డా.శివకుమార్

సాలూరు: మండలంలోని నెలిపర్తి గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వీధుల్లో బ్లీచింగ్ పిచికారీ తదితర పనులు శుక్రవారం చేపట్టారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు. పనులను మామిడిపల్లి వైద్యాధికారి డా.శివకుమార్ పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి సిద్ధం కావాలి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఇంటింటికి వెళ్లి తెలుసుకొని పరిష్కరించేందుకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సిద్ధం కావాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. పెదబోగిలి పంచాయతీ కార్యాలయంలో రెండు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఇంటింటి సర్వేపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. సాంకేతికపరమైన సమస్యలతో పనులు కాని అర్హులకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ ఆర్డీ కె.కుమారవర్మ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సురాపాడు కాలువ పూడికతీత పనుల పరిశీలన



కాలువ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మక్కువ: మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలోని దుగ్గేరు గ్రామం సమీపంలో సురాపాడు కాలువ పూడికతీత పనులను ఎంపీడీవో సిహెచ్.సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. ఎన్ఆర్జీఎస్ ద్వారా వేతనదారులు కాలువల్లో పేరుకుపోయిన తుప్పలు, డొంకల తొలగింపు పనులను చేయిస్తున్నారు. ఖరీఫ్ సమయం ఆసన్నమైనందున పంట పొలాలకు సక్రమంగా నీరు అందేలా పనులు జరిపించాలని ఏపీవో ఈశ్వరమ్మకు ఆదేశించారు.

లారీ దగ్ధంపై కేసు

లక్కవరపుకోట: మండలంలోని నిడిగట్టు గ్రామ సమీపంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు లారీ దగ్ధం కావడంతో లారీ డ్రైవర్ పెందుర్తి మండలం పులగానిపాలెం గ్రామానికి చెందిన బి.శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.ముకుందరావు శుక్రవారం తెలిపారు. రాయపూర్ – విశాఖపట్నం గ్రీన్‌ఫీల్డు హైవే నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్‌ను జామి మండలం నుంచి తెచ్చి నిడిగట్టు గ్రామం సమీపంలో అన్‌లోడ్ చేస్తుండగా లారీ కేబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి లారీ పూర్తిగా దగ్ధమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన యోగ్యశ్రీ



సీతానగరం: మండలంలోని జోగింపేట కేజీబీవీ విద్యార్థిని బురిడి యోగ్యశ్రీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసరు జె.సంధ్య శుక్రవారం తెలిపారు. యోగ్యశ్రీని కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వాహనాల తనిఖీ



ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో ఎస్ఐ కె.నీలకంఠం వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. పత్రాలు లేని వాహన చోదకులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన చోదకులు నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అంతా సహకరించాలని కోరారు. ఏఎస్ఐ కుమారస్వామి, సిబ్బంది ఉన్నారు.

మేలు జరిగితే మరో అవకాశం ఇవ్వండి

- ఎమ్మెల్యే జోగారావు



పెదపెంకిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల వివరాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు మేలు జరిగిందని భావిస్తే మరోసారి అవకాశం ఇచ్చి ఆయనను సీఎంగా చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రజలను కోరారు. బలిజిపేట మండలం పెదపెంకిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని తెలిపారు. గత ప్రభుత్వ పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు తేడాను గమనించిన మీరు మీకు మంచి జరిగిందా.. లేదా.. అనేది గమనించాలని కోరారు. సిఫార్సులు, నాయకుల ప్రమేయాలు, దళారీతనం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఈ ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉందో గమనించాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో కమిటీలే దోచుకునేవన్నారు. ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలనే సంకల్పంతో జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు సంక్షేమ పథకాలను మరింత చేరువ చేస్తున్నారన్నారు. స్థానికంగా ఉండే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు సుభిక్షమైన పాలన అందించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి పాటు పడుతున్నారని అటువంటి నాయకునే తిరిగి సీఎంగా చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జి.జగన్, శ్రీనివాసరావు, సిహెచ్.సత్యంనాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, ఎంపీటీసీ డి.శంకరరావు, జి.సత్యంనాయుడు, టి.ప్రసాదు, డి.మురళి, యు.సత్యనారాయణ, జి.హేమంత్‌కుమార్, కె.గోపినాయుడు, కె.వాసు, జాన్, ఎం.సన్నిబాబు ఎస్.భాస్కరరావు, కె.వెంకటరమణ, పోలినాయుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన జమ్మాన



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కలసిన టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురం టౌన్: ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అధికారిక పర్యటనలో భాగంగా శుక్రవారం విశాఖపట్నంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ – కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, విశాఖపట్నం నగరపాలక సంస్థలంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలో జరుగుతున్న టిడ్కో ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. రాష్ట్రం మొత్తం మీద సుమారుగా 72 వేల టిడ్కో గృహాలు ప్రారంభోత్సవాలు జరిగిన తీరును, రాబోయే ఆగస్టు నుండి డిసెంబర్ మధ్య కాలంలో విశాఖపట్నం జిల్లాలో 13 ప్రాంతాలలో సుమారుగా 10,088 టిడ్కో గృహ ప్రవేశాలు ప్రారంభోత్సవం చేసే దిశగా చేపడుతున్న చర్యలను టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి వారికి ఒక ప్రత్యేక కార్యాచరణను వివరించారు. పార్వతీపురం పట్టణ ప్రజల చిరకాల స్వప్నం సాకారం చేసే దిశగా పార్వతీపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరపున నూతన దేవాలయం ఏర్పాటు చేయవలసిందిగా వినతిపత్రం అందజేశారు.

స్థాయి తెలుసుకుని మాట్లాడాలి

గుమ్మలక్ష్మీపురం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ తీరుపై మండిపడిన రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిపై ఆరోపణలు చేసిన ఇరిడి ఎంపీటీసీ, జనసేన నేత కద్రక మల్లేశ్వరరావు తన స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడాలని రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు అన్నారు. మండల కేంద్రంలోని విలేకరులతో శుక్రవారం మాట్లాడిన ఆయన ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందేలా పనిచేస్తున్న వలంటీర్ల గురించి, ప్యాకేజీ స్టార్ తప్పుగా మాట్లాడడం ఏమాత్రం సరికాదన్నారు. మానవ అక్రమ రవాణాదారులుగా, ప్రజల డేటా ఇతరులకు తెలియజేసేవారుగా వలంటీర్‌లను ఉద్దేశించి, ఆయన చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమన్నారు. అటువంటి పవన్‌ను సమర్థిస్తూ ఆ పార్టీ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వలంటీర్ల సేవలు కళ్లముందే కనబడుతున్నా వారిపై ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. గిరిజన జేఏసీ అని, గిరిజనులను మభ్యపెట్టి ఎంపీటీసీగా పదవి పొందావే తప్ప జనసేన పార్టీ గుర్తుతో ఎంపిక కాలేదన్న సంగతిని గుర్తుంచుకోవాలన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: గర్భిణుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు సంభవించిన మాతృ మరణాలపై రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ ఆశా కార్యకర్త నుండి జిల్లా అధికారి వరకు వారి పరిధిలో వుండే గర్భిణులను పర్యవేక్షణ చేయాలన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మాతాశిశు ఆరోగ్య రాష్ట్ర అదనపు సంచాలకులు డా.కెవిఎస్ఎస్ అనిల్‌కుమార్, జాయింట్ డైరెక్టర్ హనుమంతురావు పలు సూచనలు చేశారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోలు విష్ణుచరణ్, కల్పనాకుమారి, డీఎం అండ్‌హెచ్‌ఓ డా.బి.జగన్నాథరావు, ఆర్‌బీఎస్‌కే అధికారి డి.భాస్కరరావు, డీఐవో టి.జగన్మోహనరావు, ప్రోగ్రాం అధికారి డా.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నబగ్గ కాలనీలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నదే ఆయన అభిమతమన్నారు. అందుకే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా మండల కేంద్రాలు, నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు పరిస్థితి అలా లేదని, ప్రజలు గమనించాలన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వారం వ్యవధిలోనే పథకం అందుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలతో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చిన ఘనత ఒక్క సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వానికి ఎక్కడ మంచిపేరు వస్తుందోనన్న అక్కసుతోనే చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలు మానుకోకపోతే ప్రజలే పవన్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: నిరుపేద గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సహాయ కార్యదర్శి టి.జీవన్న కోరారు. ఇదే విషయమై వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీలో ఖాళీగా ఉన్న స్థలంలో మౌలిక సదుపాయాలకు దూరంగా జీవిస్తున్న 15 గ్రామాల గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఇదే అంశం మీద పోరాటం చేస్తుంటే జేకే పాడు గ్రామానికి చెందిన గిరిజనులు కొంతమంది తమతో అనవసరంగా గొడవలకు దిగుతున్నారని, తమతో పోరాటంలో పాల్గొన్న గిరిజనులపై బైండోవర కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఎన్ని కేసులు పెట్టిన, బెదిరింపులకు పాల్పడినా గిరిజనులకు ఇళ్ల స్థలాలు సాధించి, తీరుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య, లింగరాజు, జిల్లా సభ్యులు పువ్వల ప్రసాద్, సింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పనిముట్ల మంజూరుకు వినతి



మాట్లాడుతున్న ఏవో అవినాష్

సీతానగరం: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేస్తున్న రైతుల పంటలు సాగుకూ అవసరమైన పరికరాలు, కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న వారికి కౌలు సర్టిఫికెట్లు మంజూరు చేయాలని పలువురు రైతులు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పి.ఈశ్వర నారాయణ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏవో ఎస్.అవినాష్ మాట్లాడుతూ జిరాయితీ భూములున్న రైతుల నుండి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులకు కౌలు సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇప్పటికే మండలంలో 579 మందికి కౌలు సర్టిఫికెట్లు ఇచ్చామన్నారు. ఇంకెవరికైనా సర్టిఫికెట్లు కావాలనుకుంటే సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో వరిచేను సంరక్షణకు అవసరమైన పరికరాలు కావాలని సభ్యులు కోరడంతో ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌బీకేల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, సభ్యులు బక్క సూర్యనారాయణ, ఎస్.రామకృష్ణ, గొట్టాపు అప్పారావు, సుబ్బినాయుడు, బి.ముకుందరావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



బుడ్డిపేట గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణ

సీతానగరం: గ్రామాల్లో దీర్ఘకాలంగా రైతులు ఎదుర్కొంటున్న భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికే రీసర్వే ప్రభుత్వం చేపట్టిందని దీన్ని రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. మండలంలోని బుడిపేటలో రీసర్వేకు సంబంధించి డీటీ చిట్టెమ్మ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల కిందట సర్వే జరిగిందని, అప్పటి నుంచి నేటి వరకూ ఎవరూ రీసర్వేపై దృష్టి సారించకపోవడంతో వివాదాలు నెలకొన్నాయన్నారు. పలు గ్రామాల్లో డ్రోన్ల సహాయంతో ఫ్లైయింగ్ విధానంతో సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో వీఆర్వో, సర్వేయర్ల ఆధ్వర్యంలో గ్రౌండ్ ట్రూత్ సర్వే ప్రక్రియ జరుగుతోందన్నారు. సభలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, మండల సర్వేయరు శంకరరావు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయాలి



కంది విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

బలిజిపేట: మండలంలోని రైతుభరోసా కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని ఎంపీపీ నాగమణి తెలిపారు. వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్ వ్యవసాయశాఖ అధికారులతో సంప్రదించి రైతుభరోసా కేంద్రాల వద్ద విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. మండలంలో విత్తనాలు, ఎరువుల నిల్వల వివరాలను ఏవో శ్రావణ్‌ను అడిగి తెలుసుకున్నారు. 1,721మెట్రిక్ టన్నుల విత్తనాలు, 565టన్నుల యూరియా, 228టన్నుల డీఏపీ నిల్వలు రైతుభరోసా కేంద్రాల వద్ద ఉంచడం జరిగిందన్నారు. 755మందికి సీసీఆర్‌సీ పత్రాలు అందించామన్నారు. శతశాతం రాయితీపై కంది విత్తనాలు రైతులకు అందించేందుకు రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలు ఉంచామన్నారు. ఈ సందర్భంగా కంది విత్తనాలను పలువురికి అందజేశారు. వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, జెడ్పీటీసీ రవికుమార్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



మక్కువ : పనసభద్రలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు



సాలూరు: పట్టణంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ తదితరులు

పార్వతీపురం టౌన్: సమస్యల పరిష్కారానికి తీసుకు వచ్చిందే జగనన్న సురక్ష కార్యక్రమమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం మండలం పరిధిలో వెంకంపేట, తాళ్ళబురిడి గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. జగనన్న సురక్ష ప్రయోజనాన్ని, ఆవశ్యకతను, ప్రజలకు జరుగు మేలు గురించి ప్రజలకు సవివరంగా వివరించారు. ఈ మంచి అవకాశాన్ని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవడం చాలా సంతోషదాయకమన్నారు. అలాగే 11 రకాల సేవలకు చెందిన కొత్త ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్జీదారులకు ఆయా సచివాలయాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు సమక్షంలో అందజేశారు. మండల ప్రజాప్రతినిధులు జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, పార్టీ అధ్యక్షులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి కమిటీల అక్రమాలను ఏనాడైనా ప్రశ్నించావా?

- జనసేన చీఫ్ పవన్ కళ్యాన్ తీరుపై ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు మండిపాటు



వీరఘట్టం:మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు



సీతంపేట: పవన్ తీరును ఖండిస్తున్న మండల వైఎస్సార్ సీపీ నేతలు

వీరఘట్టం: జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ తీరుపై ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు మండిపడ్డారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలోని విలేకరులతో శుక్రవారం మాట్లాడిన ఆయన వారాహి యాత్రలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న పవన్ రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తుండడం ఎంతమాత్రం తగదన్నారు. ఎప్పుడూ అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తా.. ప్రశ్నిస్తా.. అని అంటున్న పవన్ 2024 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలోని జన్మభూమి కమిటీలు చేసిన అక్రమాలను ఏనాడైనా ప్రశ్నించావా అని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీ సభ్యుల వల్ల లంచం లేనిదే ఎక్కడా అభివృద్ధి పని జరిగేది కాదని, అర్హులెవరికీ పథకాలు అందేవి కావన్నారు. ఇవన్నీ పవన్ కళ్లకు కనబడలేదా అని దుయ్యబట్టారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా లంచాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు పథకాలు అందించడం జరుగుతోందన్నారు. వీటికి దేశ వ్యాప్తంగా మంచి పేరుంది. కొన్ని రాష్ట్రాలు వాటిని తమ రాష్ట్రంలో అమలు చేసేందుకు సన్నాహాలు కూడా చేస్తున్నారన్నారు. అటువంటి వ్యవస్థలపై పవన్ తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇకనైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. వలంటీర్లకు పవన్ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు పాల్గొన్నారు.

పవన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు..

సీతంపేట: చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండల వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. స్థానిక పట్టణంలో విలేకరులతో మాట్లాడిన వారు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న పవన్ తీరును ఖండించారు. వలంటీర్లను మానక అక్రమ రవాణా చేసేవారిగా, బ్రోకర్లుగా, ప్రజల డేటా చోరీ చేసే వారిగా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారానే ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడం సాధ్యమవుతోందన్నారు. కరోనా విపత్తు కాలంలో ప్రాణాలకు తెగించి, ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పని చేయడం వల్లే కరోనా తీవ్రత లేకుండా చేయగలిగామన్నారు. అటువంటి ప్రజాసేవకులపై నిందలు వేయడం ఏ మాత్రం తగదన్నారు. పవన్ తీరు మార్చుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హితవుపలికారు. కార్యక్రమంలో పాలకొండ ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, ఎంపీటీసీ మంగయ్య, సర్పంచ్‌లు ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.